

# ఈ చరిత్ర ఇంకెన్నాళ్ళు?

పోలంపల్లి శాంతాదేవి

"పెయింటింగ్ పూర్తి అయిందా గోపీ?" అంటూ వచ్చాడు మూర్తి.

"మొన్ననే పూర్తి చేశానురా!" గోపీనాథ్ బీరువా తెరిచి నిర్మల్ పెయింటింగ్ తీశాడు.

మూర్తి చిత్రం చేతిలోకి తీసుకొని చూశాడు. నిర్మల్ పెయింటింగ్‌లో ఎల్లోరా బొమ్మ గిరిజన యువతి అని చెప్పబడుతున్నట్టుగా, విగ్రహం కొంచెం నలుపుగా, పెదవులు కొంచెం మొద్దుగా కనిపిస్తున్నాయ్. మెడలోనూ, పైకి కట్టిన జుట్టుచుట్టూ పూసలదండలు, ఆచ్ఛాదన లేని వక్షం.... మగవాడిలో కోరికలు బుసకొట్టేలా చిత్రింపబడింది.

"ఈసారి మరీ బాగా వచ్చిందిరా బొమ్మ! రోజురోజుకు నీ చేతినుండి అద్భుతమైన కళాఖండాలు వస్తున్నాయ్; నీలాంటి గొప్ప చిత్రకారుడు నా స్నేహితుడైనందుకు నే నెంత గర్విస్తున్నానో!" అన్నాడు మూర్తి ప్రశంసగా. "డెఫినెట్‌గా ఇది అయిదు వందలకి పోతుంది. నా ఫ్రెండొకతను మొన్నే చెప్పాడు, వాళ్ళ బాస్ కూతురి మారేజ్‌కి బహుమతిగా ఇవ్వడానికి చక్కటి పెయింటింగ్ కావాలని; ఇది తీసికెళ్ళి వాడికి అంటగడతాను?"

"........" గోపీనాథ్ కిటికీ దగ్గరికి వెళ్ళి నిలబడి, సిగరెట్ త్రాగుతూ బయటికి చూస్తున్నాడు మౌనంగా.

"ఏమిటి, మాట్లాడకుండా ఆలోచిస్తున్నావు?"

"పొట్టకూటికోసం బొమ్మలు వేసే దౌర్భాగ్యం నన్ను ఎప్పుడు వదులుతుందా అని!" ఆవేదనగా అన్నాడు.

"నూటికి తొంబయ్ తొమ్మిది మంది కళాకారుల జీవితాలు పొట్టకూటికోసం తాపత్రయ పడడంలోనే సరిపోయినట్టు చదువుతుంటాం! వింటుంటాం: సరస్వతీ కటాక్షం ఉన్నచోట లక్ష్మి ఉండలేదటరా; వాళ్ళిద్దరూ అత్తాకోడళ్ళు కదా?"

"నన్ను గొప్పగా లక్ష్మి వరించాలని కోరికేం లేదురా! నా కెవరైనా తిండీ బట్టా ఇచ్చి, నా కుటుంబాన్ని చూచుకోగలిగితే, చిత్రకళని ఓ తపస్సుగా సాధన చేసి అద్భుతమైన కళాఖండాలు సృష్టించాలని ఉంది! నాలాంటి వాళ్ళను పోషించడానికి మళ్ళీ ఆ రాజుల కాలం వస్తే బాగుండును!"

"మనసుపెట్టి ఒక్క బొమ్మ వేశానంటే నాలుగైదు వందలు వస్తాయ్! నీకేం తక్కువరా! మాలాగా నీకు బాసులులేరు! నెలపొడవునా చాకిరి లేదు. తిట్లు లేవు! మా జీవితాలముందు నీ జీవితం ఎంత అదృష్టవంతమైందిరా! నాకు నీలాగా బొమ్మలు వేయడం వస్తే ఎప్పుడో ఆ వెధవ ఉద్యోగం తన్నేద్దును!"

"నాలోని కళను డబ్బుగా మార్చుకోవడం నా కిష్టంలేదు, మూర్తీ! కళాకారుడిగా నా కెన్నో ఉన్నతమైన ఆశయాలున్నాయ్! సంసార జంఝాటంలో పడి నా ఆశయాలన్నీ ఆవిరైపోతున్నాయ్! నేను పెళ్ళి ఎందుకు చేసుకున్నానా, పిల్లల్ని ఎందుకు కన్నానా అని ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నాను. ప్రొద్దున లేస్తే పాలడబ్బాలు, జబ్బులు, మందులు, ఫీజులు, పుస్తకాలు, స్కూల్ డ్రెస్సులు-ఇదొక చక్రంలా నన్ను గిరగిరా త్రిప్పేస్తూంది! కాని, చిత్రమేమిటో తెలుసా? ఈ చక్రం నేను సృష్టించుకొన్నదే! నాలాంటివాళ్ళు పెళ్ళి జోలికి పోవడమంత బుద్ధితక్కువ మరొకటి లేదు. ఈ గ్రహింపు వచ్చేసరికి చక్రం తయారైపోయింది!" కొంచెం హాస్యంగా కొంచెం బాధగా అన్నాడు గోపీనాథ్.

"నీ వాదం తప్పు; అన్ని అనుభవాలు పొందినప్పుడే మానవ హృదయానికి పరిపూర్ణత వస్తుందిరా! పెళ్ళి, సంసారం లేకపోవడమంటే జీవితానికి ఒక ప్రక్క

అంతా చీకటి అన్నమాట! ఆ చీకటిలో ఏమీ చూడలేవు! ఏమీ పొందలేవు!"

"అం ఇప్పుడు చూస్తున్నదీ, పొందుతున్నదీ చాలా అద్భుతమైనది!" గోపీనాథ్ సిగరెట్ కిటికీలోంచి విసిరేసి వచ్చి బీరువాలోంచి బాటిల్ తీశాడు.

"రా, కంపెనీ ఇద్దువు!"

"ఆవిడకు తెలిస్తే చంపేస్తుంది!" అంటూనే టేబిల్ దగ్గరికి నడిచాడు మూర్తి. "ఈ తాగుడు నిన్ను సగం చెడగొడుతున్నట్టుగా నా అనుమానం!"

"ఎలా?"

"డబ్బు నాశనం! ఆరోగ్యం నాశనం!"

"కాని, ఇది తాగినప్పుడు, ఇది ఇచ్చే ఉత్తేజంతో నాలోని కళాకారుడు మేలుకొంటాడు! గొప్పగా బొమ్మలు గీస్తాడు! ఇదే లేకపోతే బొమ్మలు లేవు. కళాకారుడూ లేడు!"

"చిత్రకారుడు తాగితే తప్ప బొమ్మలు వేయడంటావా!"

"చాలావరకూ!"

అంతలో,

"నాన్నా, అమ్మ పిలుస్తూంది నిన్ను!" అని ఓ అయిదేళ్ళ పాప వచ్చి పిలిచింది. ఆ పిల్ల తొడుకున్న ఫ్రాక్ హుక్స్ తెగిపోయినట్టున్నాయి. వీపంతా బయటికి కనిపిస్తూంది! సరిగా తైలసంస్కారం లేనట్టుగా జుట్టు రాగి రంగులో మెరుస్తూంది! ముక్కులో ఓ ప్రక్క బలపం ముక్కలా చీమిడి జారి మెరుస్తూంది.

బొమ్మ లెంతో అద్భుతంగా గీచే ఓ చిత్రకారుడి కూతురంటే ఎవరూ నమ్మేట్టులేదు ఆ పాప! దరిద్రం, అంతకు మించి తలిదండ్రుల అలక్ష్యం కనిపిస్తున్నాయి.

* * *

"గోపీ, నీకో శుభవార్త తెచ్చాను!" ఓ రోజు హడావిడిగానూ, హుషారుగానూ వచ్చాడు మూర్తి.

"ఏమిట్రా?" చెక్కకి లప్పం అంటిస్తున్న గోపీనాథ్ తన పని ఆపకుండానే అడిగాడు.

"బాటిల్ తెచ్చాను! ఇలా రా! పార్టీ చేసుకొంటూ మాట్లాడుకొందాం!"

"తెచ్చావా? డబ్బులు లేవే అని బెంగపడుతున్నాను! ఈ లప్పం అంటించేసి వస్తానుండు!" అయిదు నిమిషాల్లో లప్పం అంటించడం పూర్తిచేసి, బీరువాలోంచి గ్లాసులు తీసుకొని వచ్చాడు గోపీనాథ్.

గది తలుపులు దగ్గరికి వేసి వచ్చి, సంచిలోంచి బాటిల్ తీశాడు మూర్తి. రెండు గ్లాసుల్లోకి వంచి, ఒకటి గోపీనాథ్ చేతికి అందించాడు.

"ఏరా? చాలా శ్రద్ధగా నా చేత తాగిస్తున్నావు? ఏం కావాలేమిటి నీకు నా నుండి?"

"నువ్వు నా కిచ్చేదేమిటి? నేనే నీ కోసం ఒక అదృష్టాన్ని పట్టుకు వచ్చాను!"

"బొమ్మలకి ఆర్డరా?"

"నీ మొహం! నువ్వు తలక్రిందులుగా తపస్సుచేసినా చెప్పలేవుగాని నేనే చెబుతాను! నువ్వొక రోజు అన్నావు, గుర్తుందా? నీకు పొట్టాబట్టా ఇచ్చి, నీ కుటుంబాన్ని ఎవరైనా చూచుకోగలిగితే చిత్రలేఖనంలో గొప్పగా సాధనచేసి 'వరల్డ్ ఫేమస్' అని అనిపించుకోవాలని ఉందని! నీలాంటి ఆర్టిస్టులను పోషించడానికి మళ్ళీ రాజుల కాలం వస్తే బాగుండునని అన్నావు! జ్ఞాపకముందా?"

"నిరంతరం నా మనసులో మెదిలే ఆలోచన అదే! ఎలా మరుస్తాను!"

"రాజుకు బదులు రాణిని సంపాదించాను నీ కోసం!" ఉత్సాహంగా అన్నాడు మూర్తి.

"నా బ్రతుక్కి ఇప్పుడు రాణి తక్కువైందా!" గోపీనాథ్ చిరాకుగా అన్నాడు.

"అబ్బా! నువ్వు రాణికి రాజువి కానక్కరలేదు!"

"ఇంకేమిటి?"

"ఏమిటో తరువాత చెబుతాను! ఒకరు నీ కుటుంబ బాధ్యత, నీ బాధ్యత స్వీకరించడం నీ కిష్టమే కదా?"

"ఇష్టం సంగతి తరువాత! ముందు నేను చేయాల్సిన పనేమిటో చెప్పు, ఆ రాణిగారికి! ఇంటినిండా ఇష్టమైనన్ని బొమ్మలు వేసివ్వాలటనా? లేకపోతే ఆ రాణి బొమ్మే వేయాలటనా?"

పూర్తిగా ఊహించని జవాబు వచ్చింది మూర్తి నుండి.

ఆ రాణీగారికి ఒక అమ్మాయి ఉంది! ఆ అమ్మాయికి నువ్వు తండ్రిగా నటించాలి!"

"నే నెప్పుడూ నాటకాల్లో నటించలేదు!"

"ఇది నాటకం కాదు! నిజ జీవితంలోనే నువ్వు నటించాలి! వారం రోజుల్లో ఆ అమ్మాయికి పెళ్ళిచూపులు జరుగబోతున్నాయి! కొన్ని కారణాలవల్ల ఆ అమ్మాయి తండ్రి పెళ్ళిచూపులకు వచ్చేట్టులేదు. పెళ్ళిచూపుల్లో, పిల్లతండ్రి ఏం చేస్తాడు? ఎక్కడుంటాడు అన్న ప్రశ్న ఎవరూ వేయకుండా నువ్వు ఆ అమ్మాయి తండ్రిపాత్ర పోషించాలి!"

"పెళ్ళి చూపుల్లోనేనా? ఆ తరువాత కూడా పోషిస్తూ ఉండాలా?" కొంచెం వ్యంగ్యంగా అడిగాడు.

"ఆ పిల్లకు పెళ్ళయ్యి అత్తవారింటికి వెళ్ళేవరకు. అవసరమైనప్పుడల్లా నువ్వు నటిస్తూ ఉండాలి."

"పిల్లకు తండ్రిగా అయితే పర్వాలేదు! రాణిగారికి మొగుడిగా కూడా నంటే మాత్రం మా ఆవిడ ఉరెట్టుకు చస్తుంది!"

"నువ్వసలు రాణిగారి మొహం చూడాల్సిన అవసరమే రాదు!"

"పెళ్ళిపీటలమీద కూర్చొని కన్యాదానం చేయక్కరలేదు. అప్పుడు రాణీ

గారి ప్రక్కన రాజుగారి పాత్ర పోషించొద్దూ?"

"కూర్చొని కన్యాదానం చేయడమే కదా నువ్వు చేసేపని? దానికోసం ఆమె ఎంతిస్తానందో తెలుసా? లక్షరూపాయలు! అడ్వాన్సుగా పాతిక, పెళ్ళి అయిపోగానే మిగతా డెభ్బైఅయిదు వేలూ ఇస్తానంది! నీకు నమ్మకం లేకపోతే చెక్కు రాయించుకొని నా దగ్గరే పెట్టుకొంటాను! ఏం?"

"ఇంత చిన్న పనికి ఆవిడ లక్ష రూపాయ లిస్తానందా?" గోపీనాథ్ అపనమ్మకంగా అడిగాడు.

"నీ కిది చిన్నపనిగా కనిపిస్తుందేమో గాని, నువ్వీ పనికి ఒప్పుకుంటే ఆవిడ పరువు ప్రతిష్ఠ నిలబడతాయి. ఆ అమ్మాయి అందరాడపిల్లల్లా గౌరవంగా అత్తగారింటికి వెడుతుంది. దానికోసం ఆవిడ లక్ష ఏమిటి, ఉన్నదంతా సమర్పించుకోగలదు!"

"దీనివల్ల రిస్కు ఏంలేదా? భార్యా బిడ్డలున్నవాడిని!"


"నిన్ను నేను చిక్కుల్లో వేస్తానా? ఆవిడ నాకు బాగా తెలిసిన మనిషి! పిల్ల పెళ్ళిగురించి ఆవిడ తల బద్దలుకొట్టుకుంటుంటే నేనే సలహా ఇచ్చాను ఆవిడ చాలా సంతోషంతో ఒప్పుకుంది! చెప్పు! నీవల్ల కాదంటే నేను మరొకర్ని పట్టుకుంటాను!"

"అరే! ఆగరా, బాబూ! నేను కాస్త ఆలోచించుకోవద్దూ!"

"ఆలోచించుకో! రేప్పొద్దున వస్తాను. నీ నిర్ణయం చెప్పు!" మూర్తి వెళ్ళిపోయాడు

ఆ రాత్రంతా ఆలోచించాడు గోపీనాథ్.

మూర్తి చెప్పిన పాత్ర ధరించటంలో రిస్కు తప్పకుండా ఉంది. తాత్కాలికంగానైనా ఆ అమ్మాయికి తండ్రిగా నటించడం అంటే తమాషాకాదు! ముందు




ముందు ఎన్ని సమస్యలైనా ఉత్పన్నం కావచ్చు. తనకి ఓ సంసారం, భార్యా, పిల్లలు ఉండి, ఎవరో ముక్కు మొహం తెలియని ఓ అమ్మాయికి తండ్రిగా అభినయించడమంటే తమాషా కాదు.

కాని, ఈ పని ఒప్పుకోవడంలో ఎంత ప్రమాదముందో అంత లాభమూ ఉంది. లక్ష రూపాయలు! ఎన్ని బొమ్మలు ఎన్నిరోజులు చేతులు నొప్పులు పుట్టేటట్టు వేస్తే వస్తాయి?

రాత్రంతా ఆలోచించి ఆలోచించి లక్ష రూపాయలకోసం రిస్కు తీసుకోవడానికే నిశ్చయించుకొన్నాడు గోపీనాథ్.

ఉదయం అతడి భార్య సుగుణ, "రాత్రి సరిగా నిద్రపట్టలేదా? కళ్ళు ఎర్రబడ్డాయి?" అనడిగింది.

"ఊఁ" కాఫీ సిప్‌చేస్తూ ఆమెవంక ఒక్క నిమిషం తదేకంగా చూశాడు. సరైన తిండిలేక సరైన విశ్రాంతి లేక నలిగిపోయినట్టుగా ఉంది! చాలీచాలని తిండి, చాలీచాలని డబ్బు. మనిషి ముఖంలో చిరునవ్వుని ఎలా ఊదేస్తుందో ఆమెను చూస్తే తెలుస్తుంది! పెళ్ళయిన కొత్తల్లో, పిల్లలు పుట్టకముందు ఏం నవ్విందో, ఏం సంతోషం అనుభవించిందో!

భార్యను సుఖపెట్టలేనప్పుడు మగవాడు పెళ్ళిచేసుకోవడం తప్పేమో! చూద్దాం, తను వేయబోయే అడుగు ఆమెను సుఖపెడుతుందో, దుఃఖపెడుతుందో!

* * *

రెండు రోజుల తరువాత వచ్చిన మూర్తి,

"ఏం నిశ్చయించుకొన్నావు?" అని అడిగాడు.

"ఆ అమ్మాయికి తండ్రిగా నటించడానికి, పెళ్ళిచూపుల కార్యక్రమం ఎప్పుడు?"

"ఇంకా డేట్ ఫిక్స్ చేసుకోలేదు! ఇప్పుడు ఆ రాణీగారి సమస్య తన కూతురికి తండ్రిని సంపాదించుకోవడమే! ఆ సమస్య తీరింది కదా? పెళ్ళిచూపులకిక డేట్ ఫిక్స్ చేసుకొంటుంది."

"రాణీగారికి పేరేం లేదా"

"మనం రాణీగారనే పిలుద్దాం!"

"ఇంతకీ ఆ అమ్మాయి తండ్రి ఏం చేస్తుంటాడు? చనిపోయారా, లేక ...."

"ప్లీజ్! నువ్వా వివరాలేమీ అడుగకూడదు! నేను చెప్పకూడదు! ఇది ఆవిడ పరువుకు సంబంధించిన విషయం! ఆవిడ పరువును ప్రాణంలా చూచుకొంటుంది! ఆవిడ చాలా అభిమానస్తురాలు."

పరాయి మగవాడిని తన కూతురికి తండ్రిగా నటించమన్న ఆవిడ పరువేమిటా అని ఆశ్చర్యపడ్డాడు గోపీనాథ్.

ఇప్పుడు తర్కం లేవదీసి కూర్చుంటే బాగుండదు. తనకు లక్ష రూపాయలు చేతిలో పడాలి.

"ఏం తెలియకుండా ఎలా నటించడం?"

"రాణీగారి భర్త గొప్ప ఆర్టిస్టు; అలా అని చెబుతుంది పెళ్ళివాళ్ళకు; చాలా ఏళ్ళక్రితం బొమ్మలమీది ఆపేక్షతో దేశాలు పట్టిపోయాడు; ఇప్పుడు పిల్ల పెళ్ళి సమయానికి సరిగ్గా ఊడిపడ్డాడు; చాలా వివరాలు?"

"రాణిగారు ఏం చేస్తుంటారు?"

"ఒక హైస్కూలుకి హెడ్‌మిస్ట్రెస్‌గా పనిచేస్తోంది. జాబ్ కాక ఆవిడకు రెండు సినిమా టాకీసు లున్నాయి; నెలకి అయిదారు వేలు అద్దెవచ్చే ఇళ్లున్నాయి; ఆవిడా, ఆవిడ కూతురు విద్యానగర్‌లో ఉంటారు; తిరగటానికి కారుంది. ఇంట్లో ఒకరిద్దరు నౌకర్లున్నారు, చాలా?"

"చాలు."

"ఇవాళ సాయంకాలం మనం అక్కడికి వెడదాం; నీ కూతుర్ని పరిచయం చేస్తాను."

"నా కూతురేమిటి నీ మొహం!"

"కొంపదీసి ఈ సంగతి నీ సిస్టర్‌కి తెలియనివ్వేవు; ఆవిడ ముందే ఉట్టి అనుమానపు మనిషి!"

"ఆవిడ కెందుకు తెలుస్తుంది లే; సాయంత్రం ఆఫీసునుండి డైరెక్టుగా ఇక్కడికి వస్తాను. తయారుగా ఉండు; మందు పుచ్చుకోకుండా ఉంటే బాగుంటుంది!"

"మందు పుచ్చుకొంటే ఏం? నే నెప్పుడైనా తొణికానా?" రోషంగా అన్నాడు గోపీనాథ్.

"ఆడపిల్ల దగ్గరకి వెడుతున్నాం కదా? సామాన్యంగా ఇలాంటివి సహించ లేరు ఆడవాళ్ళు, ముందే ఆ పిల్ల చాలా డిసిప్లీన్‌లో పెరిగింది!"




"ఆ అమ్మాయి ఎలా ఉంటుంది?" కుతూహలంతో అడిగాడు గోపీనాథ్.

"తినబోతూ రుచి లెందుకు!"

* * *

చిన్నగా, అందంగా ఉన్న మేడ ముందు ఆటోలో దిగారు మూర్తి, గోపీనాథ్.

మేడముందు చిన్న పూలతోట పెంచబడింది. గేటునుండి మేడవరకు రకరకాల రంగుల్లో గులాబీలు ప్రత్యేకమైన శ్రద్ధతో పెంచబడ్డాయి.

మూర్తి వరండాలో ఆగి నౌకరు ద్వారా తెలియజేశాడు లోపలికి తమ రాకని.

డ్రాయింగ్‌రూంలోకి వచ్చి కూర్చోమని ఆహ్వానం వచ్చింది.

గోపీనాథ్ భుజంమీద చెయ్యివేసి లోపలికి తీసికెళ్ళాడు మూర్తి. డ్రాయింగ్ రూం చాలా నీట్‌గా ఉంది. గదినిండా మెత్తటి కార్పెట్ పరిచివుంది. మధ్యలో ఖరీదైన ఫర్నిచర్. ఎల్లో కలర్‌లో ఉన్న గోడలకి నాలుగు ప్రక్కలా నాలుగు చిత్రపటాలున్నాయి. రెండు పటాలు గోపీనాథ్ వేసినవే ఉన్నాయి. అవిచూసి గోపీనాథ్ ఆశ్చర్యానికి అంతులేదు; "నాకంటే ముందే నా చిత్రాలు గోడలకు ఎక్కాయేమిటి?"

"ఆవిడకి పెయింటింగ్స్ అంటే చాలా అభిమానం. ఏడాది క్రితం నేనే తెచ్చాను"

అయిదారు నిమిషాల తరువాత,

"వచ్చావా, అంకుల్?" అంటూ వచ్చిందొక అమ్మాయి. ఆ పిల్ల గొంతు వీణ మీటినట్టుగా వుంది;

వయసు పద్దెనిమిదికీ, ఇరవైకీ మధ్య ఉండొచ్చు! సన్నగా ఉన్నా ఆరోగ్యం తొణికిసలాడుతూంది. తెల్లటి ముఖంలో కనుముక్కు తీర్చిదిద్దినట్టుగా వున్నాయి! మాక్సీ వేసుకొని స్లిప్పర్లు తొడుక్కుంది! ఎడమచేతికి వాచీ, కుడిచెయ్యి బోడిగా ఉంది. ఏ చీకూచింతా లేకుండా పెరిగిన అమ్మాయిలో ఉండే స్వచ్ఛతా, స్నిగ్ధతా ఉన్నాయి!

"రా అమ్మా, ఉషా! నిన్ను అత్తవారింటికి పంపించడం కోసం ఒక డాడీని వెదికి పట్టుకువచ్చాను!" అన్నాడు మూర్తి నవ్వుతూ.

"డాడీ ఎలా ఉంటారో నేను చూడలేదుగా, అంకుల్? ఈయనే మా డాడీ అనుకొంటే మాత్రం ఆ ప్రేమ అంటే ఏమిటో ఎరుగని నేను ఇన్నాళ్ళకి తండ్రి ప్రేమను చవిచూడబోతున్నాను!" ఉష ఆర్ద్రస్వరంతో అంది.

"వీడు నాటకంలో పాత్రధారి మాత్రమే! వీడినుండి ప్రేమాదరణలు ఆశించడం తెలివితక్కువ బేబీ!"

"నేను నిజం కూతురిలా ఉన్నప్పుడు ఆయన నిజం తండ్రిలా ఉండలేడూ?"

"ఏం చదువుతున్నావమ్మా?" గోపీనాథ్ పెదవులకు చిరునవ్వు పులుముకొని అడిగాడు.

"బి.ఎస్‌సి. ఫైనల్, డాడీ. నాకైతే ఎమ్.బి;బి.ఎస్ చేయాలని మహా కోరికగా ఉంది! మమ్మీకేమో నాకు త్వరగా పెళ్ళి చేసి అత్తవారింటికి పంపించెయ్యాలని ఉంది." అరమరికలు లేనిదానిలా గలగలా మాట్లాడేస్తూంది ఉష.

ఆ అమ్మాయి మాట్లాడుతూంటే ముచ్చటనిపించింది గోపీనాథ్‌కు. 'నైస్ గర్ల్' అనుకొన్నాడు.

"మీరు పెయింటింగ్స్ చాలా బాగా వేస్తారు, డాడీ! నాకూ బొమ్మలంటే చాలా ఇంటరెస్ట్. నాకు నేర్పుతారా? నేర్చుకొంటాను."




"ఇంటరెస్ట్ ఉంటే తప్పకుండా నేర్పుతానమ్మా!"

"నీకు పెళ్ళయి అత్తవారింటికి వెడితే నీకే ఒక బొమ్మ, సజీవమైన బొమ్మ పుడుతుంది. ఆ బొమ్మతో, శ్రీవారితో సరిపోతుంది, బేబీ! ఇంక నువ్వేం బొమ్మలు నేరుస్తావులే," వెక్కిరించాడు మూర్తి.

"పోండి, అంకుల్! మీరు మరీనూ! పెళ్ళికాగానే శ్రీవారిమయమూ, పిల్లలమయమూ అయిపోతారా ఆడవాళ్ళు?" ఉష బుంగమూతి పెట్టింది.

"అంకితం కాకపోతే ఇంకేం మిగుల్చుకొంటారమ్మా మీకోసం?" ఉడికిస్తున్నట్టుగా అన్నాడు మూర్తి.

"నేనేం పూర్తిగా అంకితమైపోను! నా కోసం నా ఊహలను, ఇష్టాలను, కోరికలను అలాగే ఉంచుకొంటాను! నా ప్రపంచంలోకే వాళ్ళను లాక్కుంటాను తప్ప వాళ్ళ ప్రపంచంలోకి నేను వెళ్ళను, అంకుల్!"

"పెళ్ళయ్యేదాకానే బేబీ, ఈ మాటలన్నీ!"

"మీరు చెప్పండి, డాడీ! పెళ్ళయితే ఆడపిల్ల తనకంటూ ఏం మిగుల్చుకోనక్కరలేదూ?" గారంగా అడిగింది గోపీనాథ్‌ను.

"నీకంటూ నువ్వు మిగుల్చుకొంటే, తనకంటూ అతడు మిగుల్చుకొంటే మీరిద్దరు చెరో గిరి గీసుకొన్నట్టు అవుతుందేగాని, అనురాగ దాంపత్యానికి పునాది పడదేమో, అమ్మాయ్?" చిరునవ్వుతో అన్నాడు గోపీనాథ్.

"ఎవరి వ్యక్తిత్వాన్ని వారు నిలుపుకొంటూ ఒకరి నొకరు ప్రేమించుకోలేరూ?" కళ్ళు చక్రాల్లా తిప్పుతూ అడిగింది.

"మగవాడి ప్రపంచంలోకి ఆడపిల్ల అడుగిడడమే అనాదిగా జరుగుతున్న కథ. ఆ కథని అడ్డం త్రిప్పడమంటే కొంచెం సాహసంతో కూడుకొన్న పని!"

ఉష దెబ్బతిన్నట్టుగా అడిగింది. "డాడీ,మీరు స్త్రీ స్వేచ్ఛకు వ్యతిరేకమా?"

కంగారుపడ్డాడు గోపీనాథ్. "అబ్బే! మా ఆవిడ విషయంలో నేనేం ఆంక్షలు పెట్టలేదు. ఆవిడే పిల్లలతో, చాకిరీతో ఊపిరాడనట్టుగా ఉంటుంది! ఎప్పుడైనా నా కిష్టమైన వంటకం అడిగానా, విరుచుకుపడుతుంది! నలుచుకు తిన్నంత పని చేస్తుంది!" అని, వాతావరణం తేలికపరచడానికి ప్రయత్నించాడు. "ప్రస్తుతం నా బొమ్మలే నా జీవనం. బొమ్మల మీద వచ్చిన డబ్బులో కొంత నా ఖర్చుల క్రింద ఉంచుకొని మిగతాదంతా ఆవిడ

చేతిలోనే పోస్తాను! ఏం చేశావని కూడా అడగను. పెట్టింది తిని బయటపడతాను. ఇహ నువ్వే ఆలోచించమ్మా, నేను స్త్రీ స్వేచ్ఛను గౌరవిస్తానో లేదో!"

"జీతం తెచ్చి పెళ్ళానికివ్వడం వల్ల స్త్రీ స్వేచ్ఛను గౌరవించినట్టంటే నేనొప్పుకోను, డాడీ! చిన వెచ్చాలు తేవడం, చాకలితో, మంగలితో, పాలవాడితో — ఎందరితోనో ప్రొద్దున లేస్తే వేగడం—ఆ బాదరబందీ అంతా తప్పించుకోవడం కోసం డబ్బు తెచ్చి ఆవిడ చేతిలో పోస్తారు! ఆ బాధేదో నువ్వే పడమని! ఆ డబ్బులోంచి మీకు తెలియకుండా మీ అనుమతిలేకుండా తన కిష్టమైన ఏ గద్వాల శారీనో కొనుక్కొందనుకోండి! అప్పుడు తెలుతుంది మీరు స్త్రీ స్వేచ్ఛను ఏపాటి గౌరవిస్తారో!"

"చూస్తే అమాయకంగా ఉన్నావు గాని, చాలా యుక్తంగా, గడుసుగా మాట్లాడగలవమ్మా!"

"డిబేట్స్‌లో స్త్రీల సమస్య ఏదైనా మాట్లాడి, వాదించి బోలెడన్ని ప్రైజులు కొట్టుకొన్నాను, డాడీ!" సగర్వంగా చెప్పింది ఉష.

నౌకరు ట్రేలో స్వీట్లూ, హాట్లూ తీసుకురాగా, స్టూల్ జరిపి స్వయంగా అతిథిమర్యాద సలిపింది ఉష. తరువాత, "మా ఇల్లు చూద్దురు రండి, డాడీ!" అంటూ, అతడిని క్రింద కొన్ని గదులు చూపి, పైకి తీసికెళ్ళింది. "ఇది మమ్మీ గది! ఇది నా గది! ఈ గది మా ఇద్దరికీ కలిపి డ్రాయింగ్ రూం! ఇది గెస్ట్ రూం! ఈ గది కిటికీ దగ్గర నిలబడి చూస్తే ఉదయాస్తమయాలు చాలా బాగా కనబడతాయి! మీలాంటి ఆర్టిస్టులకు ఈ గది ఎంతో బాగుంటుంది! డాడీ, మీరు ఇక్కడికి వచ్చెయ్యకూడదూ? ఈ గదిలో మీరు మంచి మంచి బొమ్మలు వేసుకోవచ్చు...."

నిజంగా తనకి ఎలాంటి ఇల్లు కావాలని, ఎలాంటి వాతావరణం కావాలని కలలు కనేవాడో — అదంతా ఇక్కడ సాక్షాత్కరించినట్టుంది! కాని, ఈ ఇల్లు తన దెలా అవుతుంది? నాటకంలో పాత్ర ధరించడానికి వచ్చిన మనిషికి!

సెలవు తీసుకొని, మూర్తితో వచ్చేస్తూ, "తల్లీ తండ్రీ ఇద్దరం ఉండి కూడా మా పిల్లల్ని ఇంత విలక్షణంగా పెంచలేకపోతున్నాం! ఆవిడ మగతోడులేకుండా ఆ పిల్లను ఇంత విలక్షణంగా పెంచిందంటే మెచ్చుకోవలసిందే! ఉషను చూస్తే ముచ్చటేస్తుంది. చాలా చక్కగా, ఎదుటి మనిషిని ఇట్టే ఆకట్టుకొనేట్టుగా మాట్లాడుతుంది. అసలు, ఆ ఇంటి వాతావరణంలోనే ఏదో హాయి ఉంది! ప్రశాంతి ఉంది! నాలోని ఆర్టిస్ట్ ప్రతిక్షణం కోరుకొనేదే అది!" అన్నాడు.

"నువ్వు కొంచెం చొరవ, సహృదయతా చూపగలిగితే ఆ ఇంటికే నిన్ను పట్టాభిషిక్తుణ్ణి చేయగలను, గోపీ!"

"మరీ అంత దురాశ నాకు లేదు! లక్ష రూపాయలు చాలు!"

* * *

ఉషకు అదే వారంలో ఒక రోజు పెళ్ళిచూపులు ఏర్పాటయ్యాయి.

పెళ్ళివాళ్ళు రావటానికి ఓ గంట ముందుగానే గోపీనాథ్‌ని తీసుకొచ్చాడు మూర్తి. మూర్తే పెళ్ళిపెద్దగా వ్యవహరిస్తున్నాడు. అటు ఇటు హడావిడిగా తిరుగుతున్నాడు. అతడి భార్య సుబ్బలక్ష్మి కూడా వచ్చింది.

గోపీనాథ్‌కి ఏమిటో గాబరాగా ఉంది. "వాళ్ళొచ్చాక నేనేం మాట్లాడాలి, మూర్తీ?"

"ఉష తండ్రి ఉంటే ఏం మాట్లాడతాడో అది మాట్లాడు."

"తండ్రిని కాదుగా?"

"తండ్రివే ననుకో!"

"ఎలా అనుకోను?"

"మరి లక్షరూపాయలు ఊరికే వస్తాయనుకున్నావా?"

"నా మాటలు వాళ్ళకి ఏమైనా అనుమానం కలిగిస్తే?"

"సరిదిద్దడానికి, నీకు అందివ్వడానికి నేనుంటాగా?"

పెళ్ళిచూపులకు వాళ్ళు కారులోనే వచ్చారు. ఆడవాళ్ళ ఒంటిమీద బంగారం, మగవాళ్ళ వేళ్ళకి ఉంగరాలు—మడత నలగని బట్టలు—పెరిగిన బొజ్జలు—వాళ్ళు బాగా ఆస్తిపరులని ఇట్టే తెలిసిపోతుంది. పెళ్ళికొడుకుకి మాత్రం ఇంకా బొజ్జ రాలేదు. మంచి ఆకర్షణీయమైన విగ్రహం. అయితే కొంచెం చామన ఛాయ. ఎల్.ఎల్.బి. పాసై ఇటీవలే ప్రాక్టీసు పెట్టాడట.

పెళ్ళిచూపుల ఘట్టం ప్రారంభమైంది. సుబ్బలక్ష్మి ఉష చెయ్యిపట్టుకు తీసుకువచ్చి అక్కడున్న తివాసీమీద కూర్చోబెట్టింది.

ఉష ఈ రోజు పట్టుచీర కట్టుకొని, చేతుల నిండుగా గాజులు వేసుకొని, తల నిండా పూలు పెట్టుకొంది. మాక్సీలో ఎంత బాగుందో, ఇవాళ చీరలోనూ అంత బాగుందనిపించింది గోపీనాథ్‌కు. ఆ పిల్లకు ఏ ముస్తాబు అయినా సహజంగా అమరుతుం దనిపించింది.

పిల్లా పిల్లవాడు ఓరఓరగా చూచుకోవడం, పెద్దవాళ్ళు ఆ సంగతీ ఈ సంగతీ ప్రశ్నించడం, అన్నీ అయ్యాయి ఫలహారాలు ఇవ్వడం, మర్యాదలూ పూర్తి అయ్యాయి.

పెళ్ళివాళ్ళు ఏదడిగినా మూర్తి సమాధానాలు చెబుతున్నాడు గోపీనాథ్ తరపున, చివరికి, పెళ్ళికొడుకు మేనమామ అట, అసలు వ్యవహారంలోకి దిగాడు. "ఎంతలో ఉన్నా"రంటూ.

"మూర్తీ, నువ్వే మాట్లాడరా ఆ విషయాలన్నీ!"

"అది పూర్తిగా నీకు సంబంధించిన విషయం. నేనెలా మాట్లాడగలను?"

"తంతాను చూడు! అసలు టైంలో నన్ను ముందుకు తోస్తావా?" గోపీనాథ్ చురచుర చూశాడు.


"అయితే, నే నోసారి సిస్టరు దగ్గరికి వెళ్ళి వస్తాను." అని లోపలికి వెళ్ళి వచ్చి, గుసగుసగా గోపీనాథ్ చెవిలో చెప్పాడు మూర్తి.

"రెండు లక్షలవరకు కట్నం, ఫ్రిజ్, టివి లాంటివి లాంఛనాల క్రింద ఇస్తాము" అన్నాడు హుందాగా గోపీనాథ్.

అసలు బాధ పెళ్ళిలో ప్రారంభమైంది గోపీనాథ్‌కు.

పెళ్ళికూతురి తండ్రి హోదాలో ప్రవర్తించమంటే మాటలుగా కనిపించలేదు. కేవలం ఉత్సవ విగ్రహంలా ఉంటే సరిపోతుందనుకొంటే మూర్తి అన్ని పనులు అతడికే పురమాయిస్తున్నాడు.

"నువ్వలా అంటీ ముట్టనట్టుగా ఉంటే నౌకర్లకి, బంధువులకి అనుమానం వస్తుంది! వాళ్ళకి ఏం తెలిసినా ఇక దాగదు! ఆ వార్త ఆగదు! ఊరూ వాడా అంటించేస్తారు! పెళ్ళివాళ్ళకు తెలిసిపోతుంది! పెళ్ళాగిపోతుంది. నీ కిచ్చిన పాతికవేలుకూడా ముక్కుపిండి వసూలు చేస్తుంది ఆ రాణీగారు. కాబట్టి కాస్త ఒళ్ళు దగ్గర పెట్టుకొని మసలుకో! ఉష తండ్రే ఈ సమయంలో ఉంటే ఎలా ప్రవర్తించేవాడో అలా ప్రవర్తించు! నౌకర్లని హుందాగా పనులు పురమాయించు! హడావిడిగా తిరుగు!" అని గదమాయించి చెప్పాడు మూర్తి. చెప్పడమే కాకుండా అతడి చేతులమీదుగా ఖర్చు పెట్టడానికి, రాణిగారు ఇమ్మన్నారని ఏభై వేం కాషున్న బాగు అతడి చేతికిచ్చాడు.




"నీ కిష్టమైనట్టు ఖర్చు పెట్టమంది. లెఖ్ఖ వ్రాయాల్సిన అవసరం కూడా లేదంది. ఎవరికీ అనుమానం మటుకు రానివ్వద్దంది. ప్రతిదానికి తనని అడగక్కరలేదనీ, పెళ్ళికూతురి తండ్రిగా నీకు సర్వ స్వతంత్రాలు ఉంటాయని అంది! ఇదిగో.... ఈ వాచీ, ఈ ఉంగరాలు, ఈ బట్టలు నీకోసం తీసుకొంది ఆవిడ! ఈ చెయిన్ నీ మెడలో వేసుకో! ఈ బట్టలు ధరించి సెంటు రాసుకో! దర్జాగా తిరుగు పెళ్ళి పందిట్లో. ఏక్ దిన్ కా రాజావి! మళ్లీ ఈ వైభవం రేపుండదు! రేపటినుండి మళ్లీ బికారివే కదా!"

మెడలో బంగారు చెయిన్ వేసుకొని, రెండు వేళ్ళకి రెండు ఉంగరాలు పెట్టుకొన్నాడు గోపీనాథ్. జరీ అంచు పంచ కట్టుకొని సిల్క్ లాల్చీ వేసుకొన్నాడు. నిలువుటద్దంముందు నిలబడి నిలువునా చూచుకొన్నాడు తనని. ఒక్కసారిగా తన రూపమే మారిపోయినట్టుగా అనిపించింది.

ఆరిష్ట్ట గోపీనాథ్ లక్షాధికారి గోపీనాథ్ అయిపోయాడు! ఈ ఐశ్వర్యం, ఈ హోదా శాశ్వతం అయితే ఎంత బాగుండును! ఒక్కరోజు భ్రమ! ఒక్కరోజు నాటకానికి ఖరీదైన కూలి ముడుతూంది!

గోపీనాథ్‌కి ఏమిటో హుషారుగానే ఉంది ఈ నాటకం! ఇంతటి ఐశ్వర్యానికి అధిపతిని చేసిన ఉష తల్లిని చూడాలని కుతూహలం అంతకంతకు పెరిగిపోయింది గోపీనాథ్‌లో. ఒకటి రెండు సార్లు పని కల్పించుకొని లోపలికి వెళ్ళాడు. ఎవరెవరో ఆడవాళ్ళు హడావిడిగా తిరుగుతూ పనులు చేస్తున్నారు!

"పెళ్ళిపిల్ల తల్లి ఎక్కడా కనిపించదేం?" ఎవరో అడిగితే,

"ప్రొద్దున గుండెలో నొప్పివచ్చిందట. డాక్టరు చూసి రెస్ట్ తీసుకొమ్మని చెప్పాడట. అందుకని గదిలో పడుకొంది! ఏం కావాలన్నా సుబ్బలక్ష్మిగారినీ, మూర్తిగారినీ అడగమన్నారు!" అని చెప్పిందొకావిడ.

లోపలికి వస్తే ఆమెను చూడొచ్చు నన్న ఆశ ఎగిరిపోయింది.

రాత్రి ముహూర్త సమయానికి వధువుతోపాటు కూర్చొన్నప్పుడు చూశాడు ప్రక్కన పీటమీద కూర్చొన్నావిడను. పందిరంతా ట్యూబ్‌లైట్లు వెలుగులు విరజిమ్ముతున్నాయి గాని సరిగా కళ్యాణమంటపం దగ్గర ట్యూబ్ పనిచేయడం లేదు. ఎవరో దాన్ని రిపేర్ చేస్తున్నారు.

కాస్తకాస్త వెలుతురులో ఓరకంట చూశాడు.

అవిడ భుజాలనిండా పమిట కప్పుకొంది! జుట్టు సగం నెరిసింది. ఆ జుట్టుని కొప్పుగా చుట్టింది. కళ్ళకి నల్లటి ఫ్రేమున్న కళ్ళద్దాలున్నాయి. మరో స్థూలకాయం అని చెప్పేందుకు లేదుగాని మనిషి నిండుగానే అనిపించింది.

ముఖం బాగా చూడ్డానికి వీలుకాలేదు. పూర్తి ప్రక్కకి తిరిగి చూడాలంటే సభ్యత అడ్డువచ్చింది.

అంతలో మగపెళ్ళివాళ్ళు రావడంతో పెళ్ళి తంతు ప్రారంభమైంది.

వరుడికి కాళ్ళు కడిగి కన్యాదానం చేయడం, మాంగల్యధారణ అన్నీ సవ్యంగా జరిగిపోయాయి. అప్పగింతల సమయం వచ్చేసింది.

పాలధారతో ఉషచేతిని భర్త చేతిలో, అత్తమామల చేతిలో పెడుతూంటే అందరితోపాటు గోపీనాథ్‌కి మనసు బరువెక్కిపోయింది.

పెళ్ళిపిల్లను అత్తగారు తీసుకొని వెళ్ళిపోయారు. చుట్టాలు కూడా అందరూ ఇంచుమించుగా వెళ్ళిపోయారు. ఇల్లంతా బోసిపోయినట్టుగా అయింది.

"సిస్టరు గదిలో ఏడుస్తూందిరా! ఇరవయ్యేళ్ళు ఏ ఆధారంతో బ్రతికిందో, ఆ ఆధారం ఇప్పుడు అత్తవారింటికి వెళ్ళిపోయింది. తను ఇప్పుడు వంటరి అయిపోయింది! ఏం చూచుకొని బ్రతకాలని క్రుళ్ళి క్రుళ్ళి ఏడుస్తూంది! వెళ్ళి ఊరడించరా, గోపీ!" అర్ధస్వరంతో చెప్పాడు మూర్తి.

"నేనా?!"

"నువ్వే!"

"అగ్రిమెంటు ప్రకారం నా డ్యూటీ అయిపోయింది!" గోపీనాథ్ సీరియస్‌గా అన్నాడు.

"ఆమె ఎవరో గుర్తుపట్టావా?"

"ఆc! నిన్నటి నుండి 'ఎక్కడో చూశాను' అని తర్జనభర్జన పడ్డాను! చివరికి ఈ రోజు, తుపాకి తూటా గుండెలోకి దూసుకు వచ్చినట్టుగా జ్ఞాపకం వచ్చింది! మూర్తీ, ఇంత నాటకం ఎందుకు ఆడావు?" కటువుగా అడిగాడు.

"ఒక ఆడపిల్ల పెళ్ళి లక్షణంగా జరిపించడం కోసం! ఉష తండ్రి ఉండీ లేనిదానిలా కాకుండా ఉండడంకోసం! చిన్నప్పుడు ఎలా పెరిగిందో, ఎలా ఉందోగాని ఈ మధ్య ఉష తల్లిని ఒకటే పీడించుకు చంపేదిరా! 'డాడీని నేను చూడాలి! నాకు డాడీ ప్రేమ కావాలి.' అంటూ. ఇన్నాళ్ళూ ఎలాగో నెట్టుకు వచ్చినా, 'డాడీ లేకుండా నేను పెళ్ళి చేసుకోను!' అని పేచీ పెట్టింది! మామూలుగా అయితే నువ్వు ఒప్పుకోవని ఈ ప్లాన్ వేయాల్సివచ్చింది! ఇప్పుడు చెప్పు, నీ డ్యూటీ అయిపోయినట్టేనా? అయిపోయిందని చెప్పు! మిగతా డెబ్బై అయిదువేలు తెచ్చి నీ ముఖాన కొడతాను! వెళ్ళిపోదువు గాని!"

వెంటనే జవాబు రాలేదు గోపీనాథ్ నుండి. పార్వతి తనని కొనేసేటంత స్థితికి ఎలా ఎదిగింది?

ముఖంలో అతడి ఆలోచనచదివినట్టుగా చెప్పాడు మూర్తి! "పార్వతి ఇంత స్థితికి ఎలా చేరుకోగలిగిందని కదూ నీ ఆలోచన? నిన్ను పెళ్ళిచేసుకొనే వరకే అవిడ పి. యు. సి. పాసైంది కదూ? నువ్వు వదిలేశాక ఆమెకు ఆ చదువే ఆధారమైంది! పార్వతి మేనమామ ఒకాయన కాంట్రాక్టుల్లో బాగా సంపాదించి ఆయనే పార్వతిని ఆదుకొన్నాడు. ఆమెకు టీచరు జాబు వచ్చేటట్టు చేశాడు. బి. ఏ. ఎం. ఏ. పరీక్షలకు చదివేట్టుగా ప్రోత్సహించాడు. ఆయనే ఇక్కడ రెండు సినిమాహాళ్ళని ఆమె పేరుమీద చేశాడు. ఇవాళ, నిన్ను కూతురు పెళ్ళికి కూలికి పిలిపించుకోగల స్థితి ఆయన కల్పించిందే!"

తన జీవితంలో మళ్ళీ పార్వతి ఎదురవుతుందనుకోలేదు!

అదీ, ఇలా తనని కొనగలిగిన స్థితిలో!

* * *

ఇరవయ్యేళ్ళనాటిమాట!

ఒక పల్లెలో తనకి టీచరుగా జాబు వచ్చింది. అక్కడే ఒకరింట్లో గది అద్దెకు తీసుకొని ఉన్నాడు. ఇల్లుగల వాళ్ళమ్మాయే పార్వతి. ఆమె అందం, ఆమె చందం, పదహారేళ్ళ వయస్సు తనని మొదటి చూపులోనే పిచ్చివాడిని చేశాయి!

ఆరు నెలలు తిరగకుండానే ప్రేమ పాకాన పడింది.

ఒకరోజు సాయంత్రం ఊరవతల గుడి దగ్గర కలుసుకున్నారు. మనసులెప్పుడో కలిశాయి! ఆ రోజు శరీరాలు కూడా కలిశాయి.

సిగ్గుతో, దుఃఖంతో కూర్చొని ఉన్న పార్వతిని చూస్తే జాలేసింది. "పార్వతీ, నీకు నేను అన్యాయం చేయను! ఈ గుడిలో దేవుడి సాక్షిగా నువ్వే నా భార్యవి! ఇంత సడెన్‌గా చెబితే మావాళ్ళు ఒప్పుకోరేమోగాని, నేను మెల్లిగా వాళ్ళని ఒప్పించడానికి ప్రయత్నిస్తాను! త్వరలోనే మన వివాహం జరిగేటట్టు చూస్తాను!" పార్వతిని గుండెలకు అదుముకొని ధైర్యం చెప్పాడు.

ఆరునెలలు గడిచేసరికి తమ వివాహానికి తలిదండ్రులను సుముఖులను చేసి ఆ శుభవార్తతో తిరిగి వచ్చేసరికి,

సుందర్ అనే యువకుడు తనకు పిచ్చెక్కిపోయే సంగతి ఒకటి చెప్పాడు. తను ఈ ఊరికి రాకముందు, పార్వతి అతడితో సంబంధం కలిగి ఉండేదట! తను వచ్చాక, తన మోజులోపడి అతడి ముఖం చూడకుండా అయిందట! తను అప్పుడప్పుడూ చూశాడు కూడా సుందర్‌తో మాట్లాడ్డం. "పార్వతి నాకు కావాలి పార్వతి లేకపోతే నేను బ్రతుకలేను!

నువ్వు మధ్యలో వచ్చినవాడివి మధ్యలో వెళ్ళిపోతే మన ముగ్గురికీ మేలు జరుగుతుంది!" అని చెప్పాడు.



పార్వతిని నిజనిజాలు అడగలేదు! 'నీలాంటి కులటను చేసుకొనే దౌర్భాగ్యం శాస్త్రలో తప్పిపోయింది!' అని చెప్పాడు. పెట్టేబేడా సర్దుకొన్నాడు. ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్ళిపోతున్నానని చెప్పాడు. సుందర్ ఓ కుఱ్ఱగాడని, తనని అన్యాయం చేయవద్దని, తను వట్టి మనిషినికూడా కాదని చెప్పింది. తనేం వినిపించుకోలేదు! వచ్చేశాడు!

దాదాపు పది సంవత్సరాల తరువాత గత జ్ఞాపకాలు మాసిపోతుండగా తలిదండ్రులు మాట్లాడిన పిల్లను చేసుకొన్నాడు. ఇప్పుడు ముగ్గురు పిల్లలు. ఒక మగ పిల్లాడు, ఇద్దరాడపిల్లలూ!

గోపీనాథ్ గత జ్ఞాపకాల నుండి బయటపడుతుండగా,

"అన్నయ్యగారూ, ఉష మీకీ ఉత్తరం ఇమ్మంది!" అంటూ ఓ కవరు తెచ్చి ఇచ్చింది సుబ్బలక్ష్మి. కవరు తెరిచి, అందులోంచి మడిచిన కాగితం పైకిలాగి, విప్పి చదవసాగాడు గోపీనాథ్.

"డాడీ!

నేను అత్తవారింటికి వెళ్ళిపోతున్నాను! నేను వెళ్ళడంతో మమ్మీ వంటరిదైపోతుంది! తను వంటరి కావలసి వస్తుందన్న భయంతో అల్లుడిని ఇల్లరికం తెచ్చుకొంటానంది! కాని, నే నొప్పుకోలేదు! నేను అతడింటికి వెళ్ళడంలో ఉండే అందం, ఆనందం అతడు నా ఇంటికి వస్తే ఉండవు!

"డాడీ! మీరు మమ్మీని వదిలేసిన కారణం చాలా సిల్లీగా, సంకుచితంగా కనిపిస్తూంది! మమ్మీ శీలాన్ని శంకించారట! మగవాళ్ళతో కాస్త చనువుగా మాట్లాడినంత మాత్రాన ఆమె కారెక్టర్ మంచిది కానట్టా? నాకు జ్ఞానం వచ్చినప్పటినుండీ ఆమెను చూస్తున్నాను! ఆవిడలో చెడ్డ ఆలోచనలు నా కెప్పుడూ కనిపించలేదు.

"కడుపుతో ఉన్న మనిషిని నిర్దాక్షిణ్యంగా వదిలేసి వెళ్ళడం పురుష లక్షణమేమోగాని, పురుషుడికి అలంకారం మటుకు కాదు! అమ్మ మేనమామే ఆమెను ఆదుకోకపోతే ఆమె ఏమయ్యేది? మీరు దైవసన్నిధిలో భార్యని చేసుకొన్న ఆమె వేశ్యగా, మీ రక్తం పంచుకు పుట్టినబిడ్డ బిచ్చగత్తెగా—మారేవాళ్ళేమో!

"అప్పుడు మీ ఆత్మ సంతృప్తిపడేదా?

"మీ గౌరవ ప్రతిష్ఠలు ఇనుమడించేవా?

"భార్యా కూతురూ ఉండి మీరు మళ్ళీ పెళ్ళి చేసుకొన్నారు! పిల్లల్ని కన్నారు! మళ్ళీ సంసారం ఏర్పరచుకొన్నారు! కాని, మమ్మీ మటుకు ఇరవయ్యేళ్ళు వంటరి జీవితం గడిపింది. ఆ వంటరి జీవితానికి నేనే ఆలంబన ఇన్నాళ్ళూ!

"మిమ్మల్ని చూడాలని నాకు బుద్ధి తెలిసినప్పటి నుండి మమ్మీని పీడిస్తున్నాను. పీడించినా, ప్రార్థించినా ఆమె కరుగలేదు! 'ఏం తప్పు చేశానని నిర్దాక్షిణ్యంగా కడుపుతో ఉన్న మనిషిని విడిచి వెళ్ళాడు! అలాంటి మనిషి ముఖం మళ్ళీ నేను చూడను!' అనేది. కాని, నాకు పెళ్ళీడు వస్తూంటే, నాకు పెళ్ళి చేసేయాలన్న ఉద్దేశ్యం కలిగినప్పటినుండి ఆమెలో మార్పు రాసాగింది. మగడొదిలేసిన దాని కూతుర్ని ఎవరు చేసుకొంటారని భయపడేది! తన స్నేహితులతో చెప్పుకొని వాపోయేది!

"తను అన్నీ చక్కజేస్తానని చెప్పాడు మూర్తి అంకుల్. మా సంగతులు మీ కెప్పుడూ చెప్పలేదేమోగాని, మీ సంగతులు ఎప్పటికప్పుడు చెబుతుండేవాడు. మిమ్మల్ని చూడకపోయినా చూసినట్టుగా అనుభూతి కలిగేది!

మీరు మా ఇంటికి వస్తారని తెలిసిన రోజు నా మనసు ఎంత ఉద్వేగంతో నిండిపోయిందో! మిమ్మల్ని చూడగానే 'డాడీ' అని కౌగలించుకోవా లనిపించింది కాని, అపరిచితుల్లా మీరున్న తీరు నన్ను దూరంగా నిలబెట్టేసింది!

డాడీ ఇదంతా ఒక ప్లాన్ అని తెలిసింది కదూ?

"కోపంతో వెళ్ళిపోతారు కదూ? వెళ్ళిపోకండి, డాడీ! ఈ వయసులో మమ్మీకి తోడుగా ఉండడం మీ కర్తవ్యం, డాడీ! మమ్మీ కున్న ఆస్తి మీ ఆస్తే! మీరు నిశ్చింతంగా అనుభవించండి! మీ మరో సంతానాన్ని ఇక్కడికి తీసుకువచ్చినా మమ్మీకి అభ్యంతర ముండదు! విడిగా ఉంచినా సరే ఏదైనా మీ ఇష్టం! కాని, మమ్మీని మాత్రం వదిలిపోకండి!

"అన్ని బాధ్యతలు మమ్మీకి వదిలేసి మీరు నిశ్చింతంగా మేడమీద గదిలో బొమ్మలు వేసుకొంటూ ఉండిపొండి!

"మమ్మీకి మీరు విధించిన ఈ ఇరవయ్యేళ్ళ శిక్ష ఇంతటితో పరిసమాప్తి చేస్తారన్న ఆశతో – మీ కూతురు ఉషారాణి."

"ఏం రాసింది?" మూర్తి అడిగాడు.

గోపీనాథ్ ఉత్తరం మూర్తి చేతిలో ఉంచాడు.

"ఏం నిర్ణయించుకొన్నావు?" చదివి అడిగాడు.

"ఉండిపోతే నేను కన్న కలలకి రూపం ఇవ్వగలను! నేను కోరుకొన్న జీవితం అనుభవించగలను! కాని, ఉండిపోలేను!" అన్నాడు భారంగా, గోపీనాథ్.

"పార్వతి మీద నీ కింకా అనుమానమా?"

"అనుమానం కాదు!"

"మరి?"

"సుగుణ తన భర్తని మరొకరితో పంచుకోవడం భరించలేదు! ఆమెకు ఈ ఐశ్వర్యం వద్దు! తన భర్త పూర్తిగా ఉంటే చాలుననుకొనే మనిషి! పార్వతికి వంటరితనం అలవాటే కదా? క్రొత్తగా కలిగే బాధేముంది?"

"అయితే వెళ్ళిపోవడానికే నిశ్చయించుకొన్నావా?"

"అవును మూర్తీ!"

"అయితే నీ కివ్వాల్సిన డబ్బు అడిగి తెస్తానుండు!"

"వద్దు, మూర్తీ! నా కూతురి పెళ్ళి చేసి నేను కూలి పుచ్చుకోవడం ఏమిటి? అడ్వాన్సుగా తీసుకొన్న పాతిక వేలు కూడా వాపసు ఇచ్చేదా మనుకొంటున్నాను!"

"దానితో సంబంధం పూర్తిగా వదిలిపోతుంది కదూ?" మూర్తి మెల్లగా అడిగాడు.

"అదెప్పుడో వదిలిందిలే! ఇప్పుడు మళ్ళీ తగిలించుకొని క్రొత్త సమస్యలు సృష్టించుకోవాలని లేదు" గోపీనాథ్ లేచాడు.

* * *

గోపీనాథ్ వెళ్ళిపోతూడని తెలిసి, పొంగుతున్న దుఃఖానికి నిగ్రహమనే అడ్డుకట్టవేసి నిర్వేదంగా నవ్వింది పార్వతి. "ఎన్నో పువ్వులు పూస్తాయి, అన్నగారూ! అన్నీ భగవంతుడి పాదాలని అలంకరించవు! వాటి పూర్వజన్మ సుకృతం కొద్దీ కొన్ని పువ్వులకే భగవంతుడి చరణాల వాలే అదృష్టం పడుతుంది! కొన్ని పువ్వులు స్త్రీలకి అలంకారమౌతాయి! ఎన్ని పువ్వులో కాళ్ళక్రిందపడి నలుగుతాయి!

"నేను నలిగిన పువ్వుని, అన్నగారూ! మగవాడిలో కరుడుకట్టిన దుష్టత్వానికి బలి అయిపోయాను! ఒక మగాడు అవసరం తీర్చుకొని వెళ్ళిపోతే, మరో మగాడు తన అవసరం తీర్చలేదన్న ఆగ్రహంతో అభాండాలు వేసి నాశనం చేశాడు. నాలాగా ఎందరో ఆడవాళ్ళు! బలి అవడం తప్పితే ఏ విధంగానూ బుద్ధి చెప్పడం చాతకాని వాళ్ళు! మా చేతగానితనం చూసే మగవాడి కృష్ణలీలలు అలా సాగిపోతున్నాయి! ఈ చరిత్ర ఇంకెన్నాళ్ళు! ఈ చరిత్ర మార్చే ఆడది ఇక పుట్టదా?"

"ఇంతకంటే ఏం చేయాలమ్మా ప్రాయశ్చితం? కూతురి పెళ్ళికి కూలికి పిలుచుకొన్నావు! అతడు చేసిన దానికి చెప్పుట్టుకు కొట్టినట్టు కాలేదూ?"

"ఇది విజయమా? ఇదే విజయమా? ఎంత నిర్దయగా వెళ్ళిపోయాడో చూడు!" పార్వతి కంఠం దుఃఖంతో పూడుకుపోగా దిండులో తలదాచుకొంది.

